క్లుప్తంగా

12న మండల సర్వసభ్య సమావేశం

ఎచ్చెర్ల క్యాంపస్ : ఈ నెల 12న ఎంపీపీ మొదలవలస చిరంజీవి అధ్యక్షతన ఎచ్చెర్ల మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆర్.రమాదేవి మంగళవారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి సభ్యులు, అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు.

కార్యదర్శిపై సస్పెన్షన్ ఎత్తివేత

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెం గ్రామానికి చెందిన గ్రామ కార్యదర్శి ఎం.అప్పలరాజుపై సస్పెన్షన్ ఎత్తివేసినట్లు ఎంపీడీఓ ఆర్.రమాదేవి మంగళవారం తెలిపారు. నెల కిందట చిలకపాలెం కూడలిలో పారిశుద్ధ్యం లోపించడంతో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే.

మురపాకలో ఇంటింటా సర్వే



సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

ఎచ్చెర్ల: లావేరు మండలం మురపాకలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది మంగళవారం ఇంటింటా సర్వే నిర్వహించారు. జ్వర బాధితుల వివరాలను నమోదు చేశారు. ఏఎన్ఎం కె.నాగరత్నం, ఎంఎల్‌హెచ్‌పీ తులసీ, ఆశా కార్యకర్తలు డి.రాధ, శ్యామల పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తం



మాట్లాడుతున్న డాక్టర్ యశ్వంత్

జి.సిగడాం : వర్షాల కారణంగా అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు బుడుమూరు యశ్వంత్, పేకల సుమబిందు అన్నారు. మంగళవారం ఆస్పత్రిలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శివప్రసాద్, సూపర్‌వైజర్ భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న ఎంపీపీ, అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: మొక్కలు నాటి సంరక్షించడం అందరి బాధ్యతని ఎంపీపీ మొదలవలస చిరంజీవి అన్నారు. ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం పచ్చదనం- పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆర్.రమాదేవి, పరిపాలనాధికారి పీవీఎస్ రామ్మోహన్, ఉపాధి ఏపీవో శోభాదేవి పాల్గొన్నారు.


నదీ తీరప్రాంతాల పరిశీలన



నదీసంగమం వద్ద పరిశీలిస్తున్న అధికారులు

గార: వంశధార నదీ తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రత్యేకాధికారి, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ అన్నారు. మంగళవారం తహశీల్దార్ ఎస్.రమణారావుతో కలిసి కె.మత్స్యలేశంలో నది, సముద్రం కలిసే చోట రాతి కట్టలు, బూరవెల్లి వద్ద పంట పొలాలను పరిశీలించారు. తీర ప్రాంతం గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని దండోరా వేయించామన్నారు.

పంట నష్టం పరిశీలన



మునియాం చెరువును పరిశీలిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: వరద నష్టాలపై అధికారులు దృష్టిపెట్టారు. ప్రత్యేకాధికారి, డ్వామా పీడీ చిట్టిరాజు, ఎచ్చెర్ల మండల అధికారులు క్షేత్రస్థాయిలో మంగళవారం పరిశీలించారు. ధర్మవరం, భగీరథపురం పంచాయతీలో గండ్లు పడ్డ చెరువులు, కొట్టుకుపోయిన రోడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎ.సింహాచలం, జలవనరుల శాఖ ఏఈ జి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు. కాగా, కొయ్యాం రోడ్డును స్థానిక నాయకులు సొంత ఖర్చులతో మరమ్మతులు చేశారు.

వానొస్తే వణుకే!

- చినుకుపడితే చెరువుల్లా మారుతున్న కాలనీలు
- శాశ్వత పరిష్కారం చూపాలంటున్న స్థానికులు



తోటపాలెం రోడ్డులో నిలిచిన వర్షం నీరు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):

వాన పడుతుందని మీడియాలో వార్తలు వస్తే చాలు శ్రీకాకుళం నగరవాసులు హడలిపోతున్నారు. చినుకుపడినా తాముంటున్న కాలనీలు చెరువుల్లా మారుతుండటమే ఇందుకు కారణం. భారీ వర్షాలకు కాకుండా కొద్దిపాటి వాన వచ్చినా కాలనీలు వాగుల్ని తలపిస్తున్నాయి. ప్రధానంగా హడ్కోకాలనీ, జానకీరామ్‌నగర్ కాలనీ, డీసీసీబీ కాలనీ, ఇందిరానగర్ కాలనీ, ఏపీహెచ్‌బీ కాలనీ, కలెక్టర్ బంగ్లా సమీప కాలనీలు, గోవిందనగర్ కాలనీ, ఏఎస్ఎన్ కాలనీ, హోమియోనగర్ కాలనీ, ఆర్.కె.నగర్‌కాలనీ, శాంతినగర్, విశాఖ-ఏ కాలనీ, విశాఖ-బి కాలనీ, బ్యాంకర్స్ కాలనీ, ఆదిత్యనగర్ కాలనీ, పెద్దపాడు, జామితోట, తోటపాలెం, చాపురంతో పాటు నగర శివారు ప్రాంతాల్లోని విలీన పంచాయతీలు ముంపునకు గురవున్నాయి. చాలా మంది ఇళ్లల్లోకి నీరు చేరిపోతుండటంతో ఇబ్బందులతు తప్పడం లేదు. రహదారులు జలమయం కావడంతో రోడ్డు ఏదో.. కాలువ ఏదో తెలియక వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షం ముప్పులేకుండా శాశ్వతంగా విముక్తి కలిగించేందుకు పాలకులు చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.



ఇటీవల హడ్కోకాలనీలో నిలిచిన వర్షం నీరు

వర్షం వస్తే భయమే..



వర్షాలు పడతాయంటే అందరూ ఆనందిస్తారు. మా పరిస్థితి అలా లేదు. వర్షం వస్తుందంటే భయమేస్తోంది. ఎన్ని రోజులు నీటిలోనే ఉండాల్సి వస్తుందోనని ఆందోళనగా ఉంటోంది. నగరపాలక అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పరిష్కరించడం లేదు.

– బొమ్మన విజయ్‌కుమార్, డీసీసీబీ కాలనీ, శ్రీకాకుళం

జ్వరాల వ్యాప్తి..



చిన్నపాటి వర్షం కురిసినా ఇళ్లలోకి నీరు చేరిపోతోంది. రోడ్లు సైతం జలమయమవుతున్నాయి. ఇంట్లో ఉండలేక, రోడ్డుపైకి రాలేక ఇబ్బందులు పడుతున్నాం. విషజ్వరాలు సైతం ప్రబలుతున్నాయి. బ్లీచింగ్ వంటివి వేసి శానిటేషన్ పనులు చేస్తే బాగుంటుంది.

– కె.బిందుసాగర్, హడ్కో కాలనీ, శ్రీకాకుళం

లోతట్టు ప్రాంతాల్లో అప్రమత్తం



బట్టేరు పరిసర ప్రాంతాల్లో పర్యటిస్తున్న అధికారులు

శ్రీకాకుళం రూరల్: వంశధార నది ఉగ్రరూపం దాల్చడంతో లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ఎం.గణపతిరావు సూచించారు. మంగళవారం బైరి, కరజాడ, రోణంకి, బట్టేరు గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. వంశధార, నాగావళి నదుల నుంచి ఈ రాత్రికి 24 వేల క్యూసెక్కు నీరు విడుదలయ్యే అవకాశం ఉందన్నారు. పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలంతా బుధవారం తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ముంపులోనే పొలాలు..

శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని 59 హెక్టార్లల్లో వరి పంట పొలాలు నీట మునిగాయి. పెదపాడు, సానివాడ, నైరా, అలికాం, రాగోలు, సింగుపురం, కిష్టప్పపేట పరిసర ప్రాంతాల్లో వరద ముంపు కనిపించింది. ఆయా పంట పొలాలను తహశీల్దార్ గణపతిరావు, వ్యవసాయాధికారి ఉషాకుమారి పరిశీలించారు. వరదనీరు పూర్తిగా బయటకు వెళ్తే ఎంతశాతం నష్టం జరిగిందో అంచనా వేయవచ్చునని అధికారులు వెల్లడించారు.

రాష్ట్ర పోటీల్లోనూ సత్తాచాటండి



క్రీడాకారులతో దాతలు, నిర్వాహకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా జట్లు సమష్టిగా రాణించి ట్రోఫీలతో తిరిగిరావాలని ఎస్ఎస్ఆర్ ట్రస్టు అధినేత సూర శ్రీనివాసరావు, పీఈటీ సంఘ జిల్లా అధ్యక్షుడు మొజ్జాడ వెంకటరమణ పిలుపునిచ్చారు. ఏపీ రాష్ట్రస్థాయి సబ్-జూనియర్స్ బాలబాలికల బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2024 పోటీలు ఈ నెల 13 నుంచి 15 వరకు తూర్పుగోదావరి జిల్లా అన్నవరం వేదికగా జరగనున్నాయి. ఈ పోటీలకు వెళ్లే క్రీడాకారులకు మంగళవారం ఇక్కడ వీడ్కోలు పలికారు. ఈ టోర్నమెంట్‌కు ఎంపికైన జిల్లా బాలబాలికల జట్లకు క్రీడా దుస్తులకు కేశవరావుపేటకు చెందిన తమ్మినేని నరేష్ (ఆర్మీ), తమ్మినేని రాజశేఖర్‌లు తమ తండ్రి ఆదినారాయణ జ్ఞాపకార్థం పంపిణీచేశారు. శ్రీనివాస్ ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో బాల్ బ్యాడ్మింటన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీజీ కృష్ణంరాజు, సానివాడ సర్పంచ్ రుప్ప రమణమూర్తి, ఎచ్చెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీరాములు, నరసన్నపేట బీసీ వెల్ఫేర్ స్కూల్ ప్రిన్సిపాల్ బి.రాయికన్న, పీడీ సింహాద్రినాయుడు, బాల్ బ్యాడ్మింటన్ కోచ్, పీఈటీ ఎం.మధుసూదనరావు పాల్గొన్నారు.

ఆంధ్రా వాల్మీకి సుబ్బారావు



నారాయణమూర్తిని సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: సాహిత్య గణపతి ఉత్సవాలలో భాగంగా స్థానిక ఉపనిష్మందిరంలో 'ఆంధ్రా వాల్మీకి- పరిచయం'పై సనపల నారాయణమూర్తి ఆధ్యాత్మిక ప్రవచనం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రా వాల్మీకిగా కవి వావిలికొలను సుబ్బారావు పేరుపొందారని చెప్పారు. వాల్మీకి రామాయణాన్ని యథాతదంగా అనువదించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మందిర నిర్వాహకులు హరనాథరావు, విశ్వేశ్వరరావు, పతంజలి శాస్త్రి, ఎం.మోహనరావు, సంగమేశ్వరరావు, నిష్టల నరసింహమూర్తి, మనోహర్, అనూరాధ, సరస్వతి పాల్గొన్నారు.

దండాలయ్యా..ఉండ్రాలయ్య!



శ్రీకాకుళం రూరల్: రాగోలు సాయిగణేష్ విద్యానగర్‌లో బాలగణపతి



విశాఖ-బీ కాలనీలో ఉండ్రాళ్ల పూజలు



ఎచ్చెర్ల: పోలీసు క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం



రాయివీధిలో మంచుకొండల్లో తేలుతూ..

శ్రీకాకుళం కల్చరల్/శ్రీకాకుళం రూరల్/ఎచ్చెర్ల: నగరంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. పాలకొండ రోడ్డులోని విజయగణపతి ఆలయంలో మంగళవారం స్వామివారికి క్షీరాభిషేకాలు నిర్వహించారు. అనంతరం గంధంతో అలంకరించారు. పి.ఎన్.కాలనీలోని కుమ్మరివీధి యూత్ ఏర్పాటు చేసిన 11 అడుగుల వినాయకుడు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాడు. విశాఖ-బి కాలనీలోని సన్‌రైజ్ టవర్స్ అపార్ట్‌మెంట్ వాసులు మంగళవారం పిల్లలతో ఉండ్రాళ్ల పూజలు చేయించారు. మహిళలు కోలాట ప్రదర్శన చేశారు. రాయివీధిలో మంచుకొండల్లో తపస్సు చేసుకుంటున్నట్లు ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహం ఆకట్టుకుంటోంది.

గుర్రపు డెక్క తొలగింపు

ఎచ్చెర్ల క్యాంపస్: విస్తారంగా వర్షాలు కురిసిన నేపథ్యంలో నారాయణపురం కుడికాలువలో నీటి ప్రవాహానికి అడ్డంగా ఉన్న గుర్రపు డెక్క తొలగింపు చర్యలను మంగళవారం జలవనరుల శాఖ అధికారులు చేపట్టారు. జేసీబీల సహాయంతో పూడికలు తీయించారు. శివారు పొలాలకు నీరు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు.

ఏటీఎం సెంటర్‌లో బ్యాటరీలు చోరీ

రణస్థలం: మండల కేంద్రంలోని రామతీర్థాలు కూడలిలో ఉన్న ఇండియా ఏటీఎం కేంద్రంలో మూడు బ్యాటరీలు ఈ నెల 3న అర్ధరాత్రి చోరీకి గురయ్యాయి. నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జె.ఆర్.పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

కొట్లాటలో ఇద్దరు మహిళలకు గాయాలు

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని డి.మత్స్యలేశం పంచాయతీ శివాజీ దిబ్బలపాలెం గ్రామంలో కొట్లాటలో ఇద్దరు మహిళలు గాయపడ్డారు. వర్షపునీటి వరద విషయంలో సోమవారం రాత్రి ఘర్షణకు దిగడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితులు శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. తనపై నలుగురు మహిళలు దాడిచేసినట్లు లక్ష్మి, తనపైనా నలుగురు మహిళలు దాడి చేసినట్లు బంగారమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం ఎనిమిది మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీఓ 85 రద్దు చేయాలి

ఎచ్చెర్ల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు ఎచ్చెర్లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు జీవో 85కి వ్యతిరేకంగా మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో 85 ద్వారా తమ మూడేళ్ల సర్వీసు అర్థం లేకుండా పోయిందన్నారు. తక్షణమే జీవో రద్దు చేయాలని కోరారు.

క్విజ్ పోటీల్లో ప్రతిభ

గార: కె.మత్స్యలేశం పంచాయతీలో వినాయక నవరాత్రులు సందర్భంగా నిర్వహించిన మండల స్థాయి క్విజ్ పోటీల్లో బుద్ధా పాఠశాల విద్యార్థులు విజేతగా నిలిచారు. సర్పంచ్ బి.లలిత ఎర్రన్న విద్యార్థులకు బహుమతులు అందించారు.

అంగన్‌వాడీ భవనం నిర్మించాలని వినతి

ఎచ్చెర్ల: మండలంలోని కొంగరాం పంచాయతీ ఏజీఎన్‌పేటలో అంగన్‌వాడీ కేంద్రానికి భవనం నిర్మించాలని గ్రామానికి చెందిన రమణమూర్తి, కోటేశ్వరరావు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎంఈవో కారు పున్నయ్యకు వినతి పత్రం అందించారు. ప్రస్తుతమున్న పాఠశాల భవనం ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితిలో ఉందని పేర్కొన్నారు.

బాలికా చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ప్రసన్నరాణి

రణస్థలం: బాలికా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని వన్ స్టాప్ సెంటర్ పరిశీలకురాలు కుప్పిలి ప్రసన్నరాణి అన్నారు. మంగళవారం లంకపేట కేజీబీవీలో బాలికల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సురక్షిత స్పర్శ, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు, గృహహింస, మానవ అక్రమ రవాణా, అత్యాచారాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఆడపిల్లలకు ఎటువంటి కష్టం వచ్చినా 100, 1098, 181, 112 వంటి హెల్ప్ నంబర్లకు సమాచారం అందించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.హైమవతి, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవడంలో ..

చంద్రబాబు విఫలం

- వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎం.వి.స్వరూప్



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వరద బాధితులను ఆదుకోవడంలో చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారని, తక్షణమే పదవికి రాజీనామా చేసి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ముఖ్యమంత్రి బాధ్యతలు అప్పగించాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎం.వి.స్వరూప్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకొచ్చిన బాబు వరద బాధితులని ఆదుకోవడంలో అనుభవం ఎక్కడా కానరాలేదని మండిపడ్డారు. వరదలు వస్తాయని హెచ్చరికలు ఉన్నా ముందస్తు చర్యలు చేపట్టడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని దుయ్యబట్టారు. సరైన జాగ్రత్తలు తీసుకుని ఉంటే అమాయకుల ప్రాణాలు నిలిచేవన్నారు. బాధితులకు సరైన ఆహారం అందక ఆకలితో అలమటిస్తున్నారని తెలిపారు. బాధితులపై కొందరు అధికారులు విరుచుకుపడటం సరికాదన్నారు. నిధులు సేకరించడంలో ఉన్న శ్రద్ధ బాధితులకు ఖర్చు పెట్టడంలో ఉండటం లేదన్నారు. ఎంతసేపు ప్రచార యావ తప్ప శతశాతం బాధితులకు సాయం అందించడం లేదని మండిపడ్డారు. వలంటీర్ వ్యవస్థ ఉంటే తక్షణ సాయం ఎక్కడికక్కడ అందించి ఎంతోమంది ప్రాణాలు కాపాడగలిగేవారని పేర్కొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

శ్రీకాకుళం అర్బన్: గర్భిణులు, బాలింతలు ఆరోగ్యకరంగా ఉండాలంటే పోషకాలు కలిగిన ఆహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని ఐసీడీఎస్ శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్టు సీడీపీవో పి.శోభారాణి అన్నారు. శ్రీకాకుళం నగరంలోని 33వ డివిజన్ గూనపాలెం సెక్టారు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలలో మంగళవారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు బి.యోగీశ్వరి, కె.కళ్యాణి, కార్యకర్తలు టి.రాజేశ్వరి, డి.ఇందుమతి, బి.ఆదిలక్ష్మి, పి.రత్నలక్ష్మి, పద్మావతి, సమీమా, విజయలక్ష్మి, మేరీ తదితరులు ఉన్నారు. అరసవల్లి సెక్టారు పరిధిలోని నాగాశపువీధి-1, 2 అంగన్‌వాడీ కేంద్రాలలో జరిగిన అంగన్‌వాడీ మాసోత్సవంలో 23వ డివిజన్ ఇన్‌చార్జి కోరాడ హరిగోపాల్ హాజరయ్యారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు డి.శాంతమ్మ, పి.తులసీబాయి, రవణమ్మ, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న దీపారాధన



బలగ బాలత్రిపుర కాలభైరవ దేవాలయంలో నక్షత్ర హారతి



మొండేటివీధిలో సహస్ర దీపాలంకరణ సేవ



కొన్నావీధిలో 1008 దీపాలతో ఓం ఆకారం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బలగ బాలత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో వినాయక ఉత్సవాల సందర్భంగా స్వామికి నక్షత్రహారతి ఇచ్చారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురాజీ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. మొండేటివీధిలోని లక్ష్మీగణపతి దేవాలయంలో సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. షిరిడీసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో భక్తులు దీపాలను వెలిగించారు. కొన్నావీధి భీమేశ్వరాలయ వద్ద 1008 దీపాలను ఓం ఆకృతిలతో అలంకరించారు.

వరద బాధితులకు సాయం



సామగ్రి, విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని కాకినాడ ఆదిత్య డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు విజయవాడ వరద బాధితులకు బాసటగా నిలిచారు. వారం రోజులుగా సేకరించిన డబ్బులతో నిత్యావసర సరుకులు, బిస్కెట్ ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్, దుస్తులు, దుప్పట్లు అందించారు. వీరిని కళాశాల సెక్రటరీ ఎం.దీపక్‌రెడ్డి, కళాశాలల జిల్లా డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు కె.శివశంకర్, వేణుగోపాల్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.డిల్లేశ్వరరావు మంగళవారం అభినందించారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

జి.సిగడాం: వర్షాల నేపథ్యంలో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని మండల పరిషత్ ప్రత్యేకాధికారి టి.రాజేంద్రప్రసాద్‌బాబు అన్నారు. మంగళవారం జి.సిగడాం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వ్యాధులు వ్యాప్తి చెందకుండా తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలత సహకారంతో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.శ్రీకాంత్, ఎంపీడీఓ ఎ.నిశ్చల, ఈఓపీఆర్‌డీ ఎస్.శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి యర్రా శారద, డీటీ ఎన్.నిర్మల, గృహనిర్మాణశాఖ ఏఈఈ మహదాసుల రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ బగాది భాగ్యలక్ష్మి, ఏపీఓ బోళ్ల సత్యనారాయణ, టీపీ గేదెల పురుషోత్తంనాయుడు, వైద్యులు యశ్వంత్, సుమబిందు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలపై అప్రమత్తం

మహారాణిపేట (విశాఖపట్నం): ప్రకృతి వైపరీత్యాలపై అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. ఇటీవల కురిసిన భారీవర్షాలకు జరిగిన నష్టాలు, సహాయక చర్యలపై విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, అల్లూరి, పార్వతీపురం మన్యం జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో మంగళవారం విశాఖ కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఐదుగురు సభ్యులతో ఆపదమిత్ర బృందాలను సిద్ధం చేసి, ప్రకృతి వైపరీత్యాల సమయంలో తీసుకోవలసిన సహాయక చర్యలపై శిక్షణ ఇవ్వనున్నామన్నారు.